నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, బుధవారం 29 మే 2024 | SURYAPET

## సజావుగా టెట్

రామగిరి, మే 28 : తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ – 2024 మంగళవారం సజావుగా కొనసాగింది. నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాల ఆవరణలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ సెంటర్‌లో పేపర్–2 సాంఘీక శాస్త్రం విభాగంలో ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి వెల్లడించారు. ఉదయం పరీక్షకు 125 మందికి గానూ 108 మంది అభ్యర్థులు హాజరు కాగా, 17 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 180 మందికి గానూ 162 మంది హాజరయ్యారు. 18 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈఓ కార్యాలయ అధికారులు పర్యవేక్షించారు.

# తగ్గిన ఎమ్మెల్సీ పోలింగ్

- 2021తో పోలిస్తే 3.97శాతం తగ్గుదల
- అత్యధికంగా యాదాద్రిలో 78.59శాతం
- అత్యల్పంగా ఖమ్మంలో 67.62శాతం
- నల్లగొండలోని దుప్పలపల్లి స్ట్రాంగ్ రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులు భద్రం
- మూడంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు
- వచ్చే నెల 5నుంచి ఓట్ల లెక్కింపు
- పోలింగ్ సరళిపై అంచనాల్లో అభ్యర్థులు

## తుది పోలింగ్ 72.44 శాతం

నల్లగొండ ప్రతినిధి, మే28(నమస్తే తెలంగాణ) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఉపఎన్నికలో పోలింగ్ శాతం తగ్గింది. 2021 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత ఉప ఎన్నికలో 3.97శాతం తగ్గింది. పోలింగ్‌కు సాయంత్రం 4గంటల వరకే గడువు ఉన్నా... అప్పటికే క్యూలైన్లలో ఉన్న ఓటర్లంతా ఓటు వేసే సరికి కొన్నిచోట్ల సాయంత్రం ఏడు గంటలు కూడా దాటింది. దాంతో 12 జిల్లాల నుంచి తుది ఓటింగ్ వివరాలు రావడానికి సోమవారం అర్థరాత్రి దాటింది. మంగళవారం ఉదయం ఫైనల్ పోలింగ్ వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన వెల్లడించారు. మొత్తం 72.44శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 78.59శాతం కాగా అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.62శాతం నమోదైంది. పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని జిల్లా కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లను భారీ బందోబస్తు నడుమ నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించారు. అక్కడ 24గంటల పాటు సీసీటీవీ కెమెరా పర్యవేక్షణలో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ నెల 5న ఓట్ల లెక్కింపు మొదలుకానుండగా ప్రధాన అభ్యర్థులంతా పోలింగ్ సరళిపై లెక్కల్లో మునిగి తేలుతున్నారు. 2021 ఎన్నికలతో పోలిస్తే 41వేలపై చిలుకు ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నా సరే ప్రస్తుత ఉప ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గింది. అప్పుడు మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉండగా 3,86,320 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 76.41శాతం పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మొత్తం 4,63,839 మంది ఓటర్లు ఉండగా 3,36,005 మంది ఓటర్లు ఓటేయగా 72.44శాతం పోలింగ్ నమోదైంది. మూడేండ్ల కిందట జరిగిన ఎన్నికతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ 3.97శాతం తగ్గింది. ఉప ఎన్నికల సమయంలో ఓట్లు నమోదు చేయించుకోవడంలో చూపిన ఉత్సాహం పోలింగ్ రోజున చూపకలేకపోయారు.

### యాదాద్రి జిల్లాలో అత్యధికం

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎప్పటిలాగే యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. ఇక్కడ 78.59 శాతం ఓటింగ్ జరుగడం విశేషం. ఇది కిందటి సారి కంటే నియోజకవర్గం సగటు ఓటింగ్‌ను కూడా క్రాస్ చేసింది. ఇక అత్యల్పంగా ఖమ్మంలో 67.62శాతమే పోలింగ్ జరిగింది. రెండో స్థానంలో జనగామలో 76.34శాతం, ఆ తర్వాత వరుసగా సిద్దిపేటలో 76.13శాతం, ములుగులో 74.58శాతం, జయశంకర్ భూపాలపల్లిలో 73.62శాతం, నల్లగొండలో 73.29 శాతం, సూర్యాపేటలో 73.15శాతం, వరంగల్‌లో 72.68శాతం, హన్మకొండలో 72.45శాతం, మహబూబాబాద్‌లో 72.15శాతం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 69.95శాతం ఓటింగ్ నమోదైంది.

### స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత

సోమవారం సాయంత్రం 12 జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిసాక బ్యాలెట్ బాక్స్‌లను ముందుగా ఆయా జిల్లా కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాలకు తరలించారు. అక్కడికి అన్ని చేరాక భారీ బందోబస్తు నడుమ రూట్ల వారీగా మంగళవారం తెల్లవారుజాము వరకు నల్లగొండ శివారులోని అనిశెట్టి దుప్పలపల్లి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములకు చేరవేశారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థతో పాటు 24 గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతోపాటు సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో నిరంతర పహారా కొనసాగేలా చర్యలు చేపట్టారు.



### వచ్చే నెల 5 నుంచి కౌంటింగ్

వచ్చే నెల 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల కౌటింగ్ కూడా దుప్పలపల్లి గోదాములోనే జరుగనుంది. మర్నాడు 5వ తేదీన అక్కడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ చేపట్టనున్నారు. ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రక్రియ మొదలు కానుంది.

ముందుగా బ్యాలెట్ బాక్స్‌లను ఓపెన్ చేసి బ్యాలెట్ పేపర్లను 25 చొప్పున ఒక బండిల్‌గా రూపొందిస్తారు. ఇది పూర్తయ్యాక తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. ఇదే సమయంలో చెల్లని ఓట్ల లెక్క తేలుస్తారు. దీని అనంతరం గెలుపు కోటా అంటే చెల్లిన ఓట్లలో 50శాతం ప్లస్ ఒకటిని ఖరారు చేస్తారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో గెలుపు కోటా ఎవరికీ రాకపోతే దాన్ని చేరుకునే వరకు ఎలిమినేషన్ పద్ధతిలో కౌంటింగ్‌ను పూర్తి చేస్తారు. మొత్తం కౌంటింగ్ పూర్తయ్యే సరికి కనీసం 48 గంటలు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. అప్పటివరకు ప్రధాన అభ్యర్థులంతా పోలింగ్ సరళిని అంచనా వేస్తూ గెలుపోటములపై సమీక్షల్లో మునిగి తేలాల్సిందే.

## స్ట్రాంగ్ రూమ్స్‌కు బ్యాలెట్ బాక్స్‌లు

- ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ సమక్షంలో సీల్
- పటిష్ట బందోబస్తు చర్యలు
- ప్రశాంత పోలింగ్‌కు కృతజ్ఞతలు : ఆర్ఓ హరిచందన

నల్లగొండ ప్రతినిధి, మే28(నమస్తే తెలంగాణ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం సాయంత్రం ముగిసిన తర్వాత అన్ని జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్స్‌కు తరలించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసినా అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్లంతా ఓటు వేయడానికి కొన్నిచోట్ల సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగిందన్నారు. పోలింగ్ ఎక్కడా ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుత వాతావరణంలో జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియలో మొత్తం 12 జిల్లాల జిల్లా కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన అడిషనల్ కలెక్టర్లు, పోలీస్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించగలిగామని చెప్పారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగలేదన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో పాటు ఆర్ఓలు పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్‌లో నిరంతరం పర్యవేక్షించారని తెలిపారు. పోలింగ్ ప్రశాంతం జరిగేందుకు సహకరించిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్లు, జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, 12 జిల్లాల సిబ్బందికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల సమక్షంలో సీల్

బ్యాలెట్ బాక్సులను అనిశెట్టి దుప్పలపల్లి గోదాములో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చగా కలెక్టర్, ఎన్నికల అధికారి దాసరి చందన, జిల్లా ఎస్పీ చందనాదీప్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ సమక్షంలో సీల్ వేశారు. వారితో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, వారి ఏజెంట్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ మురళి, పీఆర్ ఈఈ భూమన్న, ఎస్‌బీ డీఎస్పీ పి.రమేశ్, బీజేపీ నుంచి ఎలక్షన్ ఏజెంట్ నాగం వర్షిత్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న ఏజెంట్ కాళీ, అభ్యర్థి రవి, బీఆర్‌ఎస్ నుంచి అధికారిక ఏజెంట్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పలపల్లి గోదాములో స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేస్తున్న ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జ, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి



అధికారులు, మిల్లర్ల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

## జూన్ 15 నాటికి సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి

- సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట, మే 28 : రైస్ మిల్లులకు అందించిన 2023 వానకాలం సీజన్ ధాన్యం మిల్లింగ్ చేసిన బియ్యాన్ని జూన్ 15 నాటికి పూర్తి చేసి ప్రభుత్వానికి అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు మిల్లర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లుల వారీగా లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం వెంటనే మిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన జూన్ 15 నాటికి సీఎంఆర్ పూర్తి చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. సీఎంఆర్ పూర్తి చేయని మిల్లులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశానికి రాని రైస్ మిల్లుల యాజమాన్యానికి రెవెన్యూ సమన్లు ఇవ్వాలని అదనపు కలెక్టర్ బీఎస్ లతకు సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ మేనేజర్ రాములు, మార్కెటింగ్ డీఎం సోమశేఖర్‌శర్మ, మిల్లర్లు మధు, జయప్రకాశ్, చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలకు లోబడి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలి

- సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మే 28 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దానికి లోబడి ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంట్, శాసనమండలి ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆవిర్భావ వేడుకలను జరుపుకోవాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోనే వేడుకలను నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9గంటలకు వేడుకలు నిర్వహించాలని సూచించారు. బయట ఉన్న కార్యాలయాల్లో ఉదయం వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎక్కడా కోడ్ ఉల్లంఘనలు జరుగరాదని, శకటాల ప్రదర్శన, స్టాల్స్, ఆస్తుల పంపిణీ చేపట్టరాదని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలను తక్కువ బృందాలతో చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఈఓ అశోక్, డీపీఓ సురేశ్‌కుమార్, సీపీఓ కిషన్, డీఎస్ఓ మోహన్‌బాబు, డీడబ్ల్యూఓ వెంకటరమణ పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు

## ఘనపురంలో నాటు తుపాకుల కలకలం

- ఆలయంలో దాచిపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు
- స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దఅడిశర్లపల్లి, మే 28 : పీఏపల్లి మండలంలోని ఘనపురం గ్రామ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాచి ఉంచిన మూడు నాటు తుపాకులను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘనపురం నుంచి గుడిపల్లికి వెళ్లే దారిలో ఉన్న పెద్దమ్మ తల్లి దేవాలయంలో మూడు నాటు తుపాకులు ఉండగా గమనించిన పూజారి పోలీసులకు సమాచారం అందించారు. కొందరు నాటు తుపాకులను అటవీ జంతువులను వేటాడేందుకు వినియోగిస్తూ ఉండవచ్చునని, అనుమతులు లేక పోవడంతో ఆలయంలో దాచి ఉంచినట్లు పోలీసులు భావిస్తున్నారు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఘటనా స్థలాన్ని సందర్శించి తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

## ఉత్తమ ఫలితాల్లో సిటీ టాలెంట్ స్కూల్

- 28 మంది విద్యార్థులకు 10 జీపీఏ
- 100 శాతం ఫలితాలతో ముందంజ
- సూర్యాపేటలో అగ్రగామి విద్యా సంస్థ

సూర్యాపేట అర్బన్, మే 24 : సూర్యాపేటలోని సిటీ టాలెంట్ హైస్కూల్ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ జిల్లా కేంద్రంలోనే అగ్రగామి విద్యా సంస్థగా అవతరించింది. పేద, మధ్య తరగతి ప్రజల నుంచి తక్కువ ఫీజులను వసూలు చేస్తూ కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తూ తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్నది. స్థాపించిన అనతి కాలంలోనే ఉత్తమ ఫలితాలతో మరో రెండు బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి సామాన్యులకు విద్యను అందుబాటులోకి తీసుకొచ్చింది.

### 100 శాతం ఉత్తీర్ణత..

ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలకు పాఠశాల నుంచి 137 మంది విద్యార్థులు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో 28 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. 16 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 102 మంది విద్యార్థులు 9.0కి పైగా జీపీఏ సాధించారు.



ఏఎస్ రావు టాలెంట్ పరీక్షలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులు

### రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

సిటీ టాలెంట్ పాఠశాలలో చదివిన విద్యార్థులు జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో సులువుగా ప్రవేశాలు పొందుతున్నారు. ఇప్పటివరకు ఐఐటీలో 44 మంది, ఎన్ఐటీ–37, ఎంబీబీఎస్–43, ఐఐఐటీ–10, బీడీఎస్‌లో 6 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఏఎస్ రావు టాలెంట్ పరీక్షలో సెకండ్ లెవల్ రాష్ట్ర స్థాయిలో 10వ తరగతిలో 8, 15వ ర్యాంకులతో పాటు 9 తరగతి నుంచి 9, 16, 19, 20, 22, 30వ ర్యాంకులు సాధించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పాఠశాలకు చెందిన మూడు బ్రాంచ్‌లు ఉన్నాయి. సిటీ టాలెంట్ హైస్కూల్ – ఎంజీ రోడ్ సూర్యాపేట, సిటీ ఎలైట్ హైస్కూల్ – న్యూ కలెక్టరేట్ 60 ఫీట్ రోడ్, న్యూ విజన్ హైస్కూల్ – శ్రీరాం నగర్ సూర్యాపేట. సిటీ టాలెంట్ పాఠశాల విద్యార్థులు ఏ ప్రతిభా పరీక్షలకు హాజరైనా ర్యాంకులు సాధించడంలో ముందుంటున్నారు.



కరస్పాండెంట్ ప్రకాశ్‌రెడ్డి

## ఆర్టీఏ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- ప్రైవేటు ఏజెంట్ల ద్వారా అవకతవకలకు పాల్పడుతున్నట్లు గుర్తింపు
- ఆరుగురు ఏజెంట్ల వద్ద నుంచి 12,500 నగదు, 50కి పైగా లైసెన్స్ ఫారాలు స్వాధీనం
- ఏసీబీ దాడులతో షాపులకు తాళాలు వేసి పరారైన పలువురు ఏజెంట్లు




నల్లగొండలో ఏసీబీ దాడులతో షాపులకు తాళాలు వేసిన ఏజెంట్లు

నల్లగొండ సిటీ, మే 28 : ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా వాహనాలకు లైసెన్స్‌లు జారీ చేస్తూ.. వారి ద్వారా ఒక్కో లైసెన్స్‌కు రూ.250 నుంచి రూ.300 వరకు అధికారులు వసూలు చేస్తున్నారనే సమాచారంతో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. డీజీపీ ఆదేశాల మేరకు ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర ఆధ్వర్యంలో నల్లగొండ ఆర్టీఏ కార్యాలయంలో ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. లైసెన్స్‌ల కోసం వచ్చిన వారు బయటకు వెళ్లకుండా గేటు వేసి, వారి వద్ద సంబంధిత పత్రాలు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. విచారణలో ఏజెంట్ల ద్వారా అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. వాహనాలను తనిఖీ చేసే అధికారి కారుకే నెంబర్ ప్లేట్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, ఏసీబీ దాడుల విషయం తెలుసుకున్న పలువురు ఏజెంట్లు షాపులకు తాళాలు వేసి పరారు కాగా, ఆరుగురి ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పని చేయకుండా ప్రైవేట్ ఏజెంట్ల ద్వారా చేయిస్తున్నారన్నారు. ఎంవీఐ, అసిస్టెంట్ ఎంవీఐ ఆఫీస్ సిబ్బంది.. ఏజెంట్ల ద్వారా అఫీసులో లైసెన్స్‌లు, ఆర్సీలు ఇతర డాక్యుమెంట్లను చేయిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. ఆరుగురు ఏజెంట్లను విచారించి వారి వద్ద నుంచి రూ.12,500 నగదు, 50 నుంచి 60 లైసెన్స్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అధికారుల అశ్రద్ధతోనే కార్యాలయంలోకి ప్రైవేటు ఏజెంట్లు వచ్చి పనులు చేస్తున్నారని తెలిపారు.

లైసెన్స్‌లకు సంబంధించిన మరికొన్ని డాక్యుమెంట్లను పరిశీలించవలసి ఉన్నదని, వాటి పరిశీలన అనంతరం బాధ్యులైన పలువురు అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌లో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే 1064 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సూచించారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు రామారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

# గొర్రెల పంపిణీకి మంగళం!

- సబ్సిడీ గొర్రెల పథకానికి ఫుల్‌స్టాప్ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం
- లబ్ధిదారులకు డీడీ డబ్బులు వాపస్ ఇవ్వాలని నిర్ణయం
- దేవరకొండ నియోజకవర్గంలో 2,216 మందికి నిరాశ
- సందిగ్ధంలో సంక్షేమ పథకాలు
- పెండింగ్‌లో కేసీఆర్ కిట్, సీఎం సహాయ నిధి

**కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ సందిగ్ధంలో పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఐదు నెలలు గడిచినా పథకాల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు. ఇచ్చిన హామీలను గాలికొదిలేసి గత ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు చెక్ పెడుతున్నది. గొర్రెల పథకంతోపాటు కేసీఆర్ కిట్, ముఖ్యమంత్రి సహాయనిధి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇతర పథకాలను పెంచి అమలు చేస్తామన్న హామీ కూడా అమలు కాలేదు. పింఛన్లు, రుణమాఫీ, మహిళలకు రూ.2,500, రైతు భరోసా కింద రైతులకు రూ.15వేలు వంటి హామీలు అమలుకు నోచుకోకపోవడంతో సంక్షేమ పథకాలన్నీ సందిగ్ధంలో పడినట్లయింది.**

*– చందంపేట/కొండమల్లేపల్లి, మే 28*



గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ సర్కారు మంగళం పాడింది. 2018 నుంచి కొనసాగిన ఈ పథకం గొల్ల కురుమల కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఈ పథకానికి వందలాది మంది గొల్ల కురుమలు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల హడావుడి వల్ల పెండింగ్‌లో పడిన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పడేసింది. నెలలు గడుస్తున్నా గొర్రెల యూనిట్లు ఇవ్వకపోవడంతో తమ డీడీలైనా తిరిగి ఇచ్చేయాలని లబ్ధిదారులు కొంత కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారికి డబ్బులు తిరిగి ఇచ్చేయాలని పశు సంవర్ధక శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇక మండలాల వారీగా డీడీలు ఇచ్చే ప్రక్రియ షురూ కానుంది.

### దేవరకొండ నియోజకవర్గంలో 7,311 మంది..

బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18 ఏండ్లు పైబడిన వారికి గొర్రెలను అందించింది. తాసీల్దార్, ఎంపీడీఓ, మండల పశు వైద్యాధికారి సభ్యులతో లబ్ధిదారుల ఎంపిక కమిటీని నియమించింది. వీరి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను లాటరీ ద్వారా ఏ, బీ గ్రూపులుగా ఎంపిక చేశారు. ఏ గ్రూపులో 7,450 మందిని ఎంపిక చేయగా.. అందులో 7వేల మంది లబ్ధిదారులకు 2020 సంవత్సరం వరకు గొర్రెలను పంపిణీ చేశారు. 2,527 మంది లబ్ధిదారులతో బీ లిస్టును తయారు చేయగా.. అందులో 311 మందికి అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు సబ్సిడీ గొర్రెలు అందజేశారు. మొత్తం రెండు లిస్టుల్లో కలిపి 7,311 మందికి ప్రయోజనం చేకూరింది. రెండో విడుతలో గొర్రెల కోసం 2,216 మంది డీడీలు చెల్లించారు.

### లబ్ధిదారుడి వాటా రూ.43,750..

ఏ గ్రూపులో మిగిలిపోయిన 150 మంది, బీ గ్రూపులో 2,527 మంది.. మొత్తం 2,977 మంది గొల్ల రురుమలకు గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉన్నది. ఇందులో 2,527 మంది మాత్రమే గొర్రెల కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించారు. 2020 తర్వాత గొర్రెల పంపిణీని నిలిపివేసిన గత ప్రభుత్వం గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో మరోసారి గొర్రెల పంపిణీ ప్రక్రియ చేపట్టింది. ధరలు పెరిగాయనే ఉద్దేశంతో యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచుతూ లబ్ధిదారుని వాటాగా రూ.43,750 చెల్లించాలని నిర్ణయించింది. అయితే.. తొలి విడుతలో అమలు చేసిన డీడీల విధానానికి స్వస్తి పలికింది. వాటికి బదులుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి యాక్సిస్ బ్యాంకు నుంచి ఆన్‌లైన్ అకౌంట్ నంబర్‌ను కేటాయించింది. దాంతో గొల్ల కురుమలు రూ.43,750 చొప్పున తమకు కేటాయించిన అకౌంట్‌లో తమ వాటా సొమ్మును జమ చేశారు. 2,527 మందిలో 311 మందికి గొర్రెలను అందించారు. మరో 2,216 మందికి గొర్రెలు ఇవ్వలేదు.

### డీడీల వాపస్‌కు కసరత్తు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గొర్రెల స్కీంపై నిర్లక్ష్యం చేసింది. ప్రభుత్వ తీరుకు విసుగు చెందిన వారు తమకు గొర్రెలనైనా ఇవ్వాలి.. లేకుంటే తాము కట్టిన డీడీ డబ్బులైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలను ఇచ్చేందుకు ఆసక్తి చూపకపోవడం, డివిజన్‌లో గొల్ల, కురుమల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో డీడీలు కట్టిన వారికి డబ్బు వాపస్ ఇచ్చేయాలని పశు సంవర్ధక శాఖ ఎట్టకేలకు నిర్ణయించింది. దీంతో దేవరకొండ నియోజకవర్గంలో 2,216 మందికి సంబంధించిన రూ.9.69కోట్ల డీడీలను తిరిగి ఇచ్చేసేలా ఆ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మండలాల వారీగా అందించేలా కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఇదే విధంగా ఇచ్చేలా సన్నద్ధమవుతున్నారు.

**మండలాల వారీగా డీడీలు చెల్లించిన లబ్ధిదారులు**

| మండలం | డీడీలు చెల్లించిన లబ్ధిదారులు | గ్రౌండింగ్ | డీడీలు వాపస్ |
|---|---|---|---|
| చందంపేట | 842 | 287 | 555 |
| దేవరకొండ | 350 | 0 | 75 |
| గుండ్లపల్లి | 99 | 24 | 75 |
| చింతపల్లి | 518 | 0 | 518 |
| నేరేడుగొమ్ము | 183 | 0 | 183 |
| పెద్దఅడిశర్లపల్లి | 297 | 0 | 297 |
| కొండమల్లేపల్లి | 238 | 0 | 238 |
| మొత్తం | 2,527 | 311 | 2,216 |

### 15 రోజుల్లోగా అందరికీ డీడీలు ఇస్తాం



గొర్రెలు పంపిణీ చేయాలని, లేకుంటే కట్టిన డీడీలనైనా వెనక్కి ఇచ్చేయాలని గొల్ల, కురుమలు గతేడాది నుంచి ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా డీడీ సొమ్మును వాపస్ ఇచ్చేయాలని ఆదేశించారు. రెండో విడుతలో లబ్ధిదారులు రూ.43,750 డీడీలు చెల్లించారు. డబ్బులు కట్టి గొర్రెలు రాని వారి నుంచి విత్ డ్రా కోసం దరఖాస్తులను తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తాం. డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికీ 15 రోజుల్లో తిరిగి ఇచ్చేస్తాం.

*– జి.నాగయ్య, మండల పశువైద్యాధికారి, కొండమల్లేపల్లి*

### ప్రభుత్వానికి చేతగాకనే..



కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతగాకనే గొర్రెల పంపిణీ పథకాన్ని ఆపేసింది. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే పెండింగ్‌లో పెడుతూ రద్దు చేస్తుంది. దీని వల్ల పేద కుటుంబాలు ఉపాధిని కోల్పోతున్నాయి. అవినీతి ఆరోపణలతో సంక్షేమ పథకాలను సందిగ్ధంలో పడేయడం సరికాదు. ప్రజల్లో ఆదరణ ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించాలి.

*– రావుల సత్యనారాయణ, గొల్ల, కురుమల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, కొండమల్లేపల్లి*